క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న లతీష్

గాజువాక: జీవీఎంసీ 68వ వార్డులో జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ మంగళవారం పరిశీలించారు. పెద్ద అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా వేస్తున్న బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులను, చిన్న అక్కిరెడ్డిపాలెంలో రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. మెటీరియల్ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు. ఆయనతో పాటు పార్టీ వార్డు అధ్యక్షుడు సంప్రాన నూకరాజు తదితరులున్నారు.

ర్యాగింగ్ వల్ల జీవితాలు నాశనం



ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అగనంపూడి: ర్యాగింగ్ విద్యార్థుల జీవితాలను తలకిందులు చేస్తాయని, విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి అన్నారు. ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ర్యాగింగ్ అనేది ఒక ఫోబియా వంటిదని, వాటి జోలికి వెళ్తే అది జీవితాలనే నాశనం చేస్తుందని, ప్రభుత్వం ర్యాగింగ్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. తర్వాత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కన్వీనర్ కె.సూర్యనారాయణ రావు, సంతోష్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

లెఫ్ట్.. రైట్


కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్ అన్నాడో సినీ కవి.. కుడి ఎడమైతే గ్రహపాటు కాదంటున్నారు లెఫ్ట్ హ్యాండర్స్. అద్భుతాలు సృష్టిస్తామని.. అవకాశాలు అందిపుచ్చుకుని ఎదుగుతామని చెబుతున్నారు. ఎడమచేతి రాతతో ఎదిగిన ప్రముఖులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతంగా స్థిరపడతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా కథనం..

– పెదగంట్యాడ

ఎడమ చేతి రాతతో ఎందరో ప్రముఖులు

కళా, క్రీడా, రాజకీయ, పురోహిత రంగాల్లో రాణింపు

నేడు లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా...



యారాడ ఉన్నత పాఠశాలలో ఎడమ చేతిరాత రాసే విద్యార్థులు

మానవ శరీరంలో గుండె ఎడమ వైపు ఉంటుంది. ఎడమ చేతితో రాసేవారు తమ హృదయ స్పందనను కచ్చితంగా అక్షర బద్ధం చేయగలరని ప్రముఖులు అంటున్నారు. వారి అభిప్రాయం ప్రకారం ప్రపంచంలో ఉన్నత పదవులు అలంకరించిన వారిలో 30 శాతానికి పైగా ఎడమ చేతి వాటం వారే..

భిన్నమైన శైలి..

సాధరణంగా ఏ పనైనా కుడి చేతితే ప్రపంచంలో 87శాతం మంది చేస్తుంటే, 12 శాతం మంది ఎడమ చేత్తో పనులు చేస్తారని పలు సర్వేల్లో వెల్లడైందని నిపుణులు చెబుతున్నారు. మిగిలిన ఒక శాతం రెండు చేతులు వినియోగించడంలో సామర్థ్యాన్ని కనబరుస్తారు. ఎడమ చేతి వాటం వారు ప్రత్యేక స్థానాల్లో ఉంటారని.. వారి మేథోశక్తి, ఆలోచనలు, తెలివితేటలు భిన్నంగా ఉంటాయని నిపుణులు అంచనా.. ప్రస్తుతం ప్రపంచంలో గుర్తింపు పొందిన మేధావుల్లో చాలా మంది ఎడమ చేతి వాటం వారే కావడం విశేషం.



గీతామాధురి రాసిన ఎడమ చేతి చక్కటి దస్తూరి

ప్రముఖుల్లో కొందరు..

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, బిల్‌క్లింటన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ, రతన్‌టాటా, క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, యువరాజ్‌సింగ్. సినీనటుడు అమితాబ్ బచ్చన్ ఇలా ఎందరో ప్రముఖులు ఎడమ చేతి వాటంతో రాణించిన వారే..

జన్యు ప్రభావం కూడా..

పుట్టినప్పటి నుంచి కుడి.. ఎడమ చేతి వాటాలను సహజసిద్ధంగా కలిగి ఉంటారని సైన్సు చెబుతోంది. మనిషికి మెదడు కుడి, ఎడమ రెండు అర్ధ భాగాలుగా ఉంటుంది. కుడి వైపు శరీర భాగాన్ని మెదడు ఎడమ వైపు భాగం నియంత్రిస్తుందని, మెదడు కుడి అర్ధ భాగం బలంగా ఉన్న వారిలో ఎడమ చేతి వాటం వస్తుందని నిపుణులు చెబుతున్నారు. చిన్నప్పటి తల్లిదండ్రులు ఎడమ చేతి వాటం గమనిస్తే ..దానిని మాన్పించేందుకు తల్లిదండ్రులు, గురువులు యతిస్తుంటారు. కానీ జన్యుపరమైన మార్పులు ఉన్నప్పుడు అలా మాన్పించడం,మానడం సాధ్యం కాదు.

ప్రభుత్వ పాఠశాలలో..

యారాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మెల్లి హారిక, గీతామాధురి, ముఖేష్, లలితకుమయార్, భాగ్యశ్రీ, రాకేష్, ప్రియ అలాగే గంగవరం ఉన్నత పాఠశాలలో గొర్లె కిరణ్, కొవిరి భవ్యశ్రీ ఇలా పలువురు విద్యార్థులు ఎడమచేతితో రాస్తున్నారు. వీరి హ్యాండ్ రైటింగ్ కూడా అద్భుతంగా ఉంటుంది.

నాన్న నుంచి వచ్చింది



ఎడమ చేతిరాత మా నాన్నకి ఉంది. మా నాన్న నుంచి నాకు వచ్చింది.చిన్నప్పటి నుంచి అలా రాయడంతో నాకు ఎడమ చేతి రాత అలవాటైపోయింది. ఇప్పుడు ఎడమ చేత్తో మాత్రమే రాయగలను.

– వై. గీతామాధురి, పదో తరగతి, యారాడ ఉన్నత పాఠశాల

చిన్నప్పటి నుంచే..



ఎడమ చేత్తో రాయడం.. ఎడమ చేత్తో పనులు చేయడం చిన్నప్పటి నుంచి అలవాటై పోయింది. ఏ పనైనా ఎడమ చేత్తో చేయడం.. రాయడం నాకు ఎంతో ఇష్టం.

– గొర్లె కిరణ్, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఏ పనైనా తేలికగా..



చిన్నప్పటి నుంచి ఎడమ చేత్తో రాయడం.. పనులు చేయడం చాలా ఈజీగా ఉండేది..బలమైన పనులు ఎడమ చేత్తో చేయడం అలవాటు.అలాగే పాఠశాలలో ఎంత వర్క్ ఇచ్చినా ఎడమ చేత్తో చేస్తే చాలా సులభంగా ఉంటుంది.

– కొవిరి భవ్యశ్రీ, గంగవరం ఉన్నత పాఠశాల, 9వ తరగతి

లోవోల్టేజీ సమస్యకు చెక్



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యను అధికారులు మంగళవారం పరిష్కరించారు. లోవోల్టేజీతో ఇక్కట్లు అనే శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. వడ్లపూడి ఏఈ వీర్రాజు నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకొని మరమ్మతులు నిర్వహించారు. దీంతో కణితి కాళింగ వీధి వాసులు కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యకు తెరపడింది. న్యూట్రల్ వైరు కాలి పోవడం వల్ల సమస్య ఏర్పడిందని ఏఈ వీర్రాజు తెలిపారు. కొత్త వైరు వేయడం వల్ల సమస్య మరలా తలెత్తే అవకాశం ఉండదని ఆయన పేర్కొన్నారు. దీంతో కాలనీ ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉక్కు పెన్షనర్ల ఆధ్వర్యంలో ర్యాలీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్, పెన్షనర్ల ఆధ్వర్యంలో గురువారం బీచ్ రోడ్‌లో ర్యాలీ ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల్లో దాదాపు 80 శాతం మంది హయ్యర్ పెన్షన్ పొందారు. మిగిలిన వారికి కూడా త్వరలో కొత్త పీపీఓలు జారీ చేస్తామని పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ రోజు బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించి అనంతరం తమ పోరాటానికి సహకరించిన వారిని సత్కరించనున్నట్టు ప్రతినిధులు తెలిపారు. ర్యాలీలో స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

గాజువాక: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రస్తుత విద్యా సంవత్సరంలో వివిధ దూర విద్య, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 15వ వరకు గడువు పొడిగించినట్టు ఇగ్నో కోఆర్డినేటర్ వి.ఎస్.కృష్ణ తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 15వరకు అవకాశం ఉందని, అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందేవీలుందని ఆయన తెలిపారు. వివరాలకు ignouadmission.samarth.edu.in లో పొందగలరని ఆయన తెలిపారు.

అదనపు తరగతుల బహిష్కరణ



హెచ్‌ఎం కృష్ణకు అదనపు తరగతులు బహిష్కరిస్తున్నట్టు లేఖ అందిస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి: విద్యాశక్తి కార్యక్రమంలో పేరుతో సాయంత్రం ఐదు గంటల వరకు అదనపు తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడం తగదని ఉపాధ్యాయులు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తరగతులను బహిష్కరిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకు లేఖ అందించారు. విద్యాశక్తి పేరుతో తెలుగు, గణితం, ఆంగ్లంలో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని 40 రోజులుగా తరగుతులు నిర్వహిస్తున్నారు. దీంతో పాఠశాలకు చెందిన అందరూ ఉపాధ్యాయులు తరగతుల నిర్వహణ కోసం ఐదు గంటల వరకు ఉండాల్సి వస్తుంది. ఉదయం 8.45 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థులకు ఒత్తిడి గురిచేయడం సరి కాదని భావించకుండా అధికారులు అనాలోచితంగా వ్యవహరిస్తూ ఒత్తిడి తేవడం సరికాదని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉపాధ్యా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దినాయుడు, అప్పలరాజు, పైడిరాజు, ఇమాన్యుయల్, కుమార్, డి.టి.వి.రావు, ఈశ్వర్, శ్రీనివాస్, రామకృష్ణ, మురళీ, మంగరాజు, చంద్రకళ, వెంకటరావు, సూర్యకళ, విజయకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథన్ జయంతి



పదవీ విరమణ పొందిన అమ్మాజీని సత్కరిస్తున్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి

పెదగంట్యాడ: గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు రంగనాథన్ అని కొనియాడారు.

సేవలతోనే గుర్తింపు

పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అమ్మాజీని ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి రాఘవాచార్యులు, నాయకులు పులి రమణారెడ్డి, పలు గ్రంథాలయాధికారులు ఎన్‌వీ నరసింహం, బి. చంద్రకళ, వి.శిరీష, ఎస్ అప్పారావు, నూకరాజు, ఎల్. వర్మ, బి. పద్మావతి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్న ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు కొత్తగాజువాక యూపీహెచ్‌సీ వైద్యాధికారులు నులిపురుగుల నివారణ మాత్రలు మంగళవారం పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత ఆధ్వర్యంలో చిన్నారులకు డీవార్మింగ్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు కడుపులో నులిపురుగులు ఉంటే పోషకాహార లోపం, రక్తహీనతకు గురవుతారన్నారు. దీనివల్ల నీరసంగా ఉంటారని, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు కలిగి ఉంటారని అన్నారు. ఆల్బెండజోల్ మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కె.సింహాచలం, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నారాయణమూర్తి మృతి తీరనిలోటు



నారాయణమూర్తి (ఫైల్)

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రంభ నారాయణమూర్తి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రంభ నారాయణమూర్తి గుండెపోటుతో సోమవారం హఠన్మారణం చెందిన విషయం తెలిసిందే.. ఈ మేరకు రంభ నారాయణమూర్తి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవన్ రెడ్డి మాట్లాడుతూ నారాయణమూర్తి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారన్నారు. 76వ వార్డు అధ్యక్షుడిగా పని చేశారని గుర్తు చేశారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పురవీధుల్లో మువ్వన్నెల పతాకం రెపరెపలు



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



గంగవరం ర్యాలీలో పాల్గొన్న నరసింగరావు

గాజువాక: స్థానిక ఓక్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు వందడుగుల జాతీయ జెండాతో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ సమైక్యతను చాటుతూ నినాదాలు చేశారు. వుడా కాలనీ, చినగంట్యాడ ప్రాంతాల్లో ఈ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ప్రణయ్ దీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక చైతన్యం కూడా అవసరమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం మన పూర్వీకులు చేసిన త్యాగాలను ఈ తరానికి తెలియజేయడం కోసం ర్యాలీ నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఫిలోమినా, ప్రిన్సిపాల్ కోమలిదేవి, వైస్ ప్రిన్సిపాల్ అనితా లోబో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

పెదగంట్యాడ: అజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా మండలంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసే విధంగా చర్యలు తీసుకువాలని బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామంలో మండల అధ్యక్షుడు పేర్ల అప్పారావు, గరికిన పైడిరాజు ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. నరసింగరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరే విధంగా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవి, సురేష్, రెడ్డి నాయుడు, రామస్వామి పాల్గొన్నారు.

23 నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు

అల్లిపురం: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు జరుగనున్నట్టు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్.కె రెహమాన్ తెలిపారు. ఈ సభల్లో విశాఖ జిల్లా సమగ్ర అభివృద్ధి, పార్టీ చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, పోరాటాలను ఉధృతం చేయనున్నామన్నారు. మంగళవారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నగరంలో లూలూకు ఇచ్చిన వేల కోట్ల విలువైన భూమి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు కె. సత్యనారాయణ, పి. చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. పైడిరాజు, కె. సత్యాంజనేయ, సి.ఎస్. క్షేత్రపాల్ రెడ్డి, కె.వనజాక్షి, ఎన్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలివ్వాలి

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి అమలు చేసేందుకు చూస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం గురించి పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ద్వారకానగర్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆదాయం కోల్పోయే ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని, వాహనమిత్ర రూ.15 వేలు విడుదల చేయాలని, జీవో 21 రద్దు చేసి డ్రైవర్లకు జీవించే హక్కు కల్పించాలన్నారు. ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో శివాజీ, కె.దేవుడు, రవికృష్ణ, రాజు, బి.నూకరాజు, పి.అప్పలరాజు, శ్రీనివాస్, కె.రాము, కె.వెంకటేష్ పాల్గొన్నారు.